

ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో యోగా చేస్తున్న డాక్టర్ అలివేలు మంగ

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● హోమియోపతి వైద్యాధికారి డాక్టర్ అలివేలు మంగ

ముషీరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని హోమియోపతి వైద్యాధికారిని డాక్టర్ అలివేలు మంగ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీ ఆవరణలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ శిబిరంలో వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అలివేలు మంగ మాట్లాడుతూ ఆయుష్ పథకం ద్వారా ఆస్పత్రి ప్రాంగణంలో ప్రతిరోజు రెండు గంటల పాటు అనుభవజ్ఞులైన యోగా మాస్టర్లచే యోగా నేర్పిస్తున్నామని అన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు యోగా శిబిరాన్ని ఏర్పాటు చేశాం అన్నారు. కార్యక్రమంలో యోగా మాస్టర్ నిఖిల్, ఆస్పత్రి పీహెచ్‌ఎన్ ఫిల్లిస్, ఏఎన్ఎం విజయకుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మహిళల హక్కుల సాధనకు ఉద్యమాలు

చిక్కడపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల సాధనకోసం ఉద్యమాలు చేస్తామని ఐద్వా (ఆలిండియా డెమొక్రటిక్ ఉమెన్స్ ఆర్గనైజేషన్) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.జ్యోతి అన్నారు. ఈనెల 21 నుంచి 23 వరకు జరిగే మహిళా దివ్యాంగుల సంక్షేమం, సాధికారతపై రాష్ట్ర సదస్సు జరుగనున్న క్రమంలో సదస్సు పోస్టర్‌ను మంగళవారం చిక్కడపల్లిలోని ఎన్‌పీఆర్‌డీ (దివ్యాంగుల హక్కుల జాతీయవేదిక) రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. సభ్యులు వెంకటేష్, రాజు, దశరథ్, శశికళ, దీపిక తదితరులు పాల్గొన్నారు.

గణపతి ఆలయం హుండీ లెక్కింపు

చిక్కడపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయం హుండీ ఆదాయం రూ. 3,11,574 రూపాయలు వచ్చింది. మంగళవారం ఆలయం ప్రాంగణంలో హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పి. ఆండాళు, ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ ఛైర్మన్ ఎం.నర్సింగ్‌రావు, ఈవో లక్ష్మారెడ్డి పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, భక్తులు లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ నర్సింగ్‌రావు, ఈవో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి భక్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భానుచందర్, బండారు నవీన్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి సమస్యలు వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు

● కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో మంచినీటి ఎద్దడి నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని మణియార్‌పట్టి, చప్పల్‌బజార్, మోతీమార్కెట్, సునార్ గల్లీ తదితర ప్రాంతాలలో జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ వెంకటేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌యాదవ్‌తో కలిసి ఆమె పాదయాత్ర నిర్వహించి మంచినీటి ఎద్దడి వివరాలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరా సరిగ్గా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోయారు. దీనిపై స్పందించిన ఆమె వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరించాలని, నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు పాటిల్, ఆశీష్, భీమ్‌రాజ్, రూపకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

బాలికపై దాడి.. పోక్సో కేసు నమోదు

బర్కత్‌పుర మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా పరిచయమున్న బాలిక వేరే వ్యక్తితో చనువుగా ఉండడంతో అది తట్టుకోలేని ఆ వ్యక్తి బాలికపై దాడికి పాల్పడిన సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అఫ్జల్‌గంజ్‌లో నివాసముంటున్న సంతోష్(26) ప్రైవేటు ఉద్యోగి ఇతనికి మూడేళ్లుగా 17 ఏళ్ల వయస్సు గల బాలికతో పరిచయం ఉంది. ఆ బాలిక కొన్ని రోజులుగా వేరే వ్యక్తితో చనువుగా ఉంటుంది. ఇది గమనించిన సంతోష్ మంగళవారం ఆ బాలిక చదివే కళాశాల వద్దకు వచ్చి ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు పోక్సో కింద కేసు నమోదు చేశారు.

ఎంఎంటీఎస్ రైలు ఎక్కబోతూ కిందపడి వ్యక్తి మృతి

బర్కత్‌పుర మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న ఎంఎంటీఎస్ రైలు ఎక్కబోతు ప్రమాదవశాత్తు కింద పడిపోయి ఓ గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం... 45 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం రాత్రి ఉప్పుగూడ రైల్వేస్టేషన్ వద్ద కదులుతున్న ఎంఎంటీఎస్ రైలు ఎక్కబోతు ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి శరీరంపై నలుపు రంగు టీ షర్టు, బూడిద రంగు ప్యాంటు ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాచిగూడలో వృద్ధురాలి అదృశ్యం

బర్కత్‌పుర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటికి వచ్చిన ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... మోహిదీపట్నంలో నివాసం ఉండే చాకలి జానమ్మ(75) తిలక్‌నగర్ ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చింది. మంగళవారం సాయంత్రం 3 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆ సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేరు. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన బంధువులకు జానమ్మ కనిపించలేదు. పరిసర ప్రాంతాలలో వెతికినా ఆచూకీ లభించలేదు. మనుమరాలు చైతన్య కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలుకింద పడి పెయింటర్ ఆత్మహత్య

బర్కత్‌పుర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి పెయింటర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఫలక్‌నామాలో నివాసం ఉండే కావేటి శంకర్ (58) పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల భార్య చనిపోయింది. నలుగురు కుమారులు పట్టించుకోకపోవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఫలక్‌నామా రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



కవాడిగూడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని 55 సంవత్సరాల వ్యక్తి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాల ప్రకారం... పీఎస్ పరిధిలోని గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న బోయిగూడ స్వాతి వైన్స్ సమీపంలో ఓ గుర్తుతెలియని 55 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతి చెందాడని సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు స్థానికంగా యాచక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తాడని స్థానికులు తెలిపినట్లు పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో ఫుట్‌పాత్‌పై చనిపోయి ఉన్నాడని ఆయన ఆచూకీ తెలిసిన వారు వెంటనే గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో లేదా ఫోన్ నంబర్ 8712660143లో సమాచారం అందించాలని ఆయన కోరారు.

సమస్యలకు నిలయంగా సుందరయ్య పార్కు



సుందరయ్య పార్కు మెయిన్ గేట్

● విరిగిపోయి మూలనపడిన క్రీడా పరికరాలు

● అపరిశుభ్రంగా వాకింగ్ ట్రాక్

● నిర్వహణ కొరవడిన షటిల్ కోర్టు

● పట్టించుకోని అధికారులు

రాంనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో పేరొందిన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు సమస్యలకు నిలయంగా మారింది. దీంతో ఆహ్లాదం, ఆట విడుపు, వాకింగ్ కోసం వచ్చే సందర్శకులు, క్రీడాకారులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి ప్రారంభం కావడంతో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వందలాది మంది సందర్శకులు బాగ్‌లింగంపల్లి పరసర ప్రాంతాలకు చెందిన ప్రజలు వస్తుంటారు. పార్కులో సమస్యలను పరిష్కరించాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పార్కులో చెత్త, చెదారం పేరుకుపోవడంతో వాకింగ్‌కు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. పార్కులోని చిల్డ్రన్స్ పార్కులో ఆట పరికరాలు విరిగిపోయి నెలలు గడుస్తున్నా వాటిని పునర్ నిర్మాణం చేయకుండా మూలనపడేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఈ ప్లే గ్రౌండ్‌లో పిల్లలు ఆడుకునే జంపింగ్ రాడ్ వంగి ప్రమాదకరంగా మారింది. పార్కులోని షటిల్ కోర్టు నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో షటిల్ క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. పార్కులో చెత్తను ఏ రోజుకు ఆ రోజు తరలించకుండా ఓ మూలన వేయడంతో చెత్తతో దుర్వాసన నెలకొంటుంది. పార్కులోని టాయిలెట్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వాటిని సందర్శకులు వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది, మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టాయిలెట్ల నిర్వహణ కూడా సక్రమంగా లేదు. పార్కులో పోకిరీల బెడద వల్ల పార్కుకు వచ్చే మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. పార్కు మెయిన్ గేట్‌కు ఇరువైపుల ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేయడం వల్ల సందర్శకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పార్కులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



పార్కులో పేరుకుపోయిన చెత్త





చిల్డ్రన్స్ ప్లే గ్రౌండ్‌లో విరిగి మూలనపడి, వంగిపోయి ఆట పరికరాలు

వేసవిలో సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని జలమండలి అధికారులు మంచినీటి, కలుషిత నీటి సరఫరా కాకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ వాటర్‌వర్క్స్ అధికారులను ఆదేశించారు. తెలంగాణ రీజనల్ ఇరిగేషన్ కార్పొరేషన్ (టీజీఆర్ఐసీ) స్కీమ్‌కింద కవాడిగూడ ఆర్యసమాజ్ గల్లీలో చేపడుతున్న మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్‌ల ఆధునీకరణ, రోడ్ల నిర్మాణం ఆలస్యం అవుతుందని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్యే గోపాల్ మంగళవారం కవాడిగూడ డివిజన్‌లోని ఆర్యసమాజ్, కుమ్మరి బస్తీ తదితర ప్రాంతాలలో వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పాదయాత్ర చేసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ పనులు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు ముఠాజైసింహ, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, నగర నాయకులు సానెం చంద్రశేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీహరి, రవి, మేకల శ్రీనివాస్, రాజుయాదవ్, ప్రవీణ్‌గౌడ్, శివగౌడ్, విశ్వనాథ్, రూప, మంజుల, కవాడిగూడ వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



కవాడిగూడ ఆర్యసమాజ్ వీధిలో పాదయాత్రలో ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు సమస్యలు వివరిస్తున్న మహిళలు



సమావేశంలో మాట్లాడుతున్న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి సూర్యం

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి: సూర్యం

రాంనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న 60 వేల మంది కార్మికులు, ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి కె.సూర్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి నెల 1వ తేదీన వేతనాలు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. మంగళవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సమావేశం యూనియన్ అధ్యక్షుడు కొత్తపల్లి రవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన అంటూ అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి గ్రామ పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. సమావేశంలో నాయకులు అరుణ్‌కుమార్, వెంకటి, నర్సింహ, రాందాస్, కొమురయ్య, చందు తదితరులు పాల్గొన్నారు.

ప్రణయ్ హత్య కేసులో కోర్టు తీర్పుపై హర్షం

కవాడిగూడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రణయ్ హత్యకేసులో జిల్లా ఎస్సీఎస్టీ కోర్టు ఇచ్చిన తీర్పు పరువు హత్యలు చేస్తున్న కుల దురంహకార ముఠాలకు ఒక గుణపాఠం కావాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కిరాతక హత్య కేసుని విస్తృత స్థాయిలో విచారణ చేసి హంతకులకు శిక్ష పడేలా విధులు నిర్వహించిన పోలీసు అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

రామ్‌రాజయ్య పోరాటాలు మరువలేనివి

రాంనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ, సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రామ్‌రాజయ్య చేసిన పోరాటాలు మరువలేనివని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం అధ్యక్షుడు ఐలన్న అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రామ్‌రాజయ్య సంస్మరణ సభ జరిగింది. సభలో ఐలన్న మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగానికి రామ్‌రాజయ్య రాజీనామా చేసి భవన నిర్మాణ కార్మిక రంగంలోని ఆదిలాబాద్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం పోరాటం చేశారని కొనియాడారు. రామ్‌రాజయ్య ఆశయం కోసం కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు.



సన్మానగ్రహీతలతో అతిథులు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

చిక్కడపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సాహిత్య, సాంఘిక, సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సేవా సంస్థ కమలాకర చారిటబుల్ ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ సంస్కృతి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణీ రామాయణం ఆధ్యాత్మిక సాహిత్య రూపకంలో పాత్రలు పోషించిన పాత్రధారులను సన్మానించి అభినందించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అభిలషించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం పూర్వ అధ్యక్షుడు పి. విజయబాబు, ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత్రి డా. కేవీ కృష్ణకుమారి, ప్రసిద్ధ రచయిత్రి ముక్తేవి భారతి, నిర్వాహకులు భారతీ కమలాకర్, లలితాపరమేశ్వరి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



రామును సన్మానిస్తున్న అతిథులు

రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిభావంత కవి రాము

చిక్కడపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిభావంతుడు కవి రాము అని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. రసమయి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రఖ్యాత కవి డా. ఎం కె రాము జన్మదిన వేడుక లలితగీతానికి పట్టాభిషేకం పేరిట జరిగింది. లిటిల్ మ్యూజీషియన్స్ అకాడమీ రామాచారి శిష్యబృందం సురేఖ, శశికళ తదితరులు రాము రచించిన గీతాలను మధురంగా గానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో రాము రాసిన పాటల సంఖ్యతో పోల్చితే వేరెవరూ అన్ని పాటలు రాయలేదని అన్నారు. రాము లలిత గీతాలలో ప్రేమతోపాటు సామాజిక చింతన ఉంటుందని ఆయన ప్రతిభావంత కవి అన్నారు. కేంద్ర మాజీ మంత్రి డా. సముద్రాల వేణుగోపాలచారి మాట్లాడుతూ రాము సినీగీతాలు, నృత్యనాటికలు రాసి ప్రజల హృదయాలను కదిలించారన్నారు.

క్రమశిక్షణతో చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చు

● పోటీ పరీక్షల నిపుణులు బాలలత

చిక్కడపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చునని పోటీపరీక్షల నిపుణులు, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమి డైరెక్టర్ బాలలత అన్నారు. గ్రూప్-1 ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన అభ్యర్థులను మంగళవారం అశోక్‌నగర్‌లోని అకాడమీలో ఆమె సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో అనూషరెడ్డి, వినయ్‌కుమార్, నవీన్‌రెడ్డి, శ్రావ్య, సిబ్బంది ఉమేష్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో మహిళలు దేనినైనా సాధించగలరు

● స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

నల్లకుంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చిత్తశుద్ధి, ఏకాగ్రత లక్ష్యం గురిపెడితే మహిళలు దేనినైనా సాధించగలరని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టీటీఏ) మహిళా ఆధ్వర్యంలో వర్చువల్ ఉమెన్స్ డే ఉత్సవాలు సంస్థ అధ్యక్షులు మల్లిపెద్ది నవీన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీటీఏ వర్చువల్ నిర్వహించడం అభినందనీయమన్నారు. లింగ సమానత్వం, మహిళా సాధికారత కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐపీఎస్ సుమతి, కమిటీ సలహాదారు పల్లవిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కవితారెడ్డి, మీడియా కమ్యూనికేషన్ డైరెక్టర్ దీపికారెడ్డి, జనరల్ సెక్రటరీ శివరెడ్డి, సంయుక్త కార్యదర్శి నిశాంత్, టీటీఏ వ్యవస్థాపకులు డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి, సలహా కమిటీ అధ్యక్షుడు డాక్టర్ విజయపాల్‌రెడ్డి, సహ అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌రెడ్డి, సభ్యులు భరత్‌రెడ్డి, శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



● పైడిపల్లి స్వామిగౌడ్‌కు సత్కారం

త్యాగరాయగానసభలో ఆదర్శ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పవర్‌టెక్ ట్రాన్స్ ఫార్మర్ ఎండీ పైడిపల్లి స్వామి గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. ఆదర్శ సంస్థ అధినేత వంగాల బాల్‌రాజ్‌గౌడ్, సుజాత, మహంకాళిసికింద్రా బాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్ పాల్గొన్నారు. -చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ దాసోజు శ్రావణ్‌ను సన్మానించిన బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్

పార్టీ కోసం కష్టపడే నాయకులకే పదవులు

● బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ

ముషీరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ బలోపేతానికి కష్టపడే నేతలను అధిష్టానం గుర్తించి పదవులను ఇస్తుందని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన డాక్టర్ దాసోజు శ్రావణ్‌ను మర్యాదపూర్వకంగా బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ ఆధ్వర్యంలో ముషీరాబాద్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకులు శ్రావణ్‌ను కలిసి సన్మానించి అభినందించారు. కేసీఆర్, కేటీఆర్ సారథ్యంలో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని పేర్కొన్నారు.




వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

పేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగం

● కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్యశిబిరాలు పేదప్రజలకు ఎంతో ఉపయోగపడుతాయని గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని జనప్రియ అబోడ్స్ అపార్ట్‌మెంట్స్‌లో డా. శంకర్ పర్యవేక్షణలో పీపుల్స్ ఆస్పత్రివారు మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో వైద్యపరీక్షలు చేయించుకున్న కార్పొరేటర్ పావని మాట్లాడుతూ ఈ వైద్యశిబిరం ద్వారా పేదప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించడం అభినందనీయమని ఇది ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, ఉచిత వైద్యశిబిరం పీఆర్వో బొర్లకుంట దీపక్‌కుమార్, సలహాదారు డా. అర్జున్, డా. మన్మోహన్, డా. బాషా, డా.పల్లవి, తిరుమల్, శృతి, భవ్యవతి, మౌనిక, సబిత తదితరులు పాల్గొన్నారు.



భారీ రావిచెట్టుకు జీహెచ్ఎంసీ సిబ్బందితో పిచికారి చేయిస్తున్న బీజేపీ నేతలు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● బీజేపీ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు దిలీప్‌యాదవ్

కవాడిగూడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్ అన్నారు. మంగళవారం కవాడిగూడ బండమైసమ్మనగర్ కమ్యూనిహాలులో ఉన్న భారీ రావిచెట్టుకు పురుగు రావడంతో జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి మంగళవారం జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి ఆ చెట్టుకు పురుగుల ముందును పిచికారి చేయించారు. కమ్యూనిటీ హాలులో అంగన్‌వాడీ సెంటర్‌లో చదువునే చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమస్య తమ దృష్టికి రావడంతో బీజేపీ నేతలు సలంద్రి దిలీప్‌యాదవ్, వెంకటేష్, ఎంసీ మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, వెంకటస్వామి, అంగన్‌వాడీ టీచర్ స్వప్న సిబ్బందితో కలిసి బండమైసమ్మ కమ్యూనిటీ హాలు ఆవరణలో ఉన్న రావిచెట్టుకు పురుగులు తొలగిపోయేలా జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి పిచికారి చేయించామని తెలిపారు.



విజయశాంతిని సత్కరించిన కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్ పార్టీ తరపున అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ప్రముఖ సినీ నటి, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు విజయశాంతిని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి మాజీ ఛైర్మన్ జి.నాగభూషణం, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, నాయకుడు బాలకృష్ణగుప్తాలు మంగళవారం ఆమెను సత్కరించారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి